

పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా

● కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

అమీర్‌పేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ పార్క్ ప్రాంతంలో రూ.5.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీవరేజ్ పైప్‌లైన్ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లక్ష్మి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో డివిజన్ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పనులు చేపడతామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జలమండలి డీజీఎం వంశీ, మేనేజర్ హిందూజా, నాయకులు ఖలీల్ బేగ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



మహిళకు హెల్మెట్ అందజేస్తున్న యంగ్ ఇండియా ప్రతినిధులు

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాహుల్ హెగ్డే సూచించారు. రహ్మత్‌నగర్ చౌరస్తాలో యంగ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వాహనదారులకు హెల్మెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలకు రక్షణ కవచంగా ఉండే హెల్మెట్‌లను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ హరి ప్రసాద్, ట్రాఫిక్ సీఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అభివృద్ధి చేసేందుకే కులగణన

● కోట నీలిమ

అమీర్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేయాల్సి వస్తుందన్న భయంతో తమ ప్రభుత్వంపై బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కులగణన సర్వే చారిత్రాత్మకమైనదన్నారు. ఈ సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. రాష్ట్ర చరిత్రలో బీసీలకు దక్కిన గొప్ప గౌరవమని, కులగణన సర్వేను సీఎం రేవంత్ రెడ్డి అత్యంత పారదర్శకంగా నిర్వహించారని ఆమె పేర్కొన్నారు. బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే కులగణను నిర్వహించినట్లు తెలిపారు.

పని చేయించుకుని జీతాలివ్వలేదని ఆందోళన

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో పని చేయించుకుని మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఫ్లై ఫ్రూట్ బాక్స్ సంస్థలో పనిచేసిన 185మంది మహిళలు శుక్రవారం అర్ధరాత్రి బోరబండ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కార్మికనగర్‌కు చెందిన నీలంటి సంతోష్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్లై ఫ్రూట్ బాక్స్ పేరుతో ఆరు నెలలుగా ఆన్‌లైన్ వ్యాపారం చేస్తున్నాడు. సంస్థలో 120 మంది డెలివరీ బాయ్స్, 65 మంది ప్యాకింగ్, కటింగ్ కోసం పనిచేస్తున్నారు. సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి గత మూడు నెలలుగా జీతం ఇవ్వడం లేదు. సుమారు రూ.25 లక్షలకు పైగా జీతాలు రావాలని బాధితులు చెబుతున్నారు. సంస్థ యజమాని కనిపించకుండా తిరుగుతుండటంతో అతని తల్లిదండ్రులను తీసుకొచ్చి బోరబండ పోలీసులకు అప్పగించారు. అయితే ఈ సమయంలో సంస్థ యజమాని సంతోష్ ప్రేమ వివాహం చేసుకుని స్టేషన్‌కు రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సంతోష్ బాధితులతో మాట్లాడేలా పోలీసులు చొరవ తీసుకోవడంతో వారు శాంతించారు.

జలమండలి స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జలమండలి బోర్డు తొలగించి విలువైన స్థలం కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో 1.20 ఎకరాల సలాన్ని గతంలో ప్రభుత్వం జలమండలికి అప్పగించింది. పార్థసారధి అనే వ్యక్తి ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా జలమండలి అధికారులు స్వాధీనం చేసుకుని సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. హోంగార్డులను రక్షణగా నియమించారు. కాగా స్థల వివాదం విషయంలో పార్థసారధి సిటీ సివిల్‌కోర్టును ఆశ్రయించాడు. కేసు నడుస్తుండగా మూడు రోజులుగా పార్థసారధి, అతని మనుషులు సూచిక బోర్డులు తొలగించారు. ఈ విషయంపై ప్రశ్నించిన హోంగార్డు రాఘవేంద్రపై దుర్భషలాడారు. జలమండలి తట్టిఖానా సెక్షన్ మేనేజర్ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పార్థసారధి, అతని మనుషులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారులపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదైంది. వెంకటగిరిలో కిరాణాషాపులు, పాన్ షాపుల్లో మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ ఎస్ఐ రమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. గంధం పరిమళ అనే కిరాణా షాపు నిర్వాహకురాలు మైనర్లకు సిగరెట్లు అమ్మినట్టు తేలడంతో కేసు నమోదు చేసి ఆరు వేల రూపాయల విలువ చేసే 88 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కె.వెంకటేశ్వరరావు అనే కిరాణాషాపు యజమాని ఓ విద్యార్థికి సిగరెట్లు అమ్ముతుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మూడు వేల రూపాయల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

విదేశీ యాత్ర పేరుతో మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విదేశీ యాత్ర పేరిట డబ్బు వసూలు చేసి మోసం చేసిన ట్రావెల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. కాప్రాకు చెందిన ఎ.విష్ణువర్ధన్ ప్రభుత్వ ఐఐసీటీలో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. 2019లో స్నేహితుడి ద్వారా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఉన్న ఐడియా మంత్ర ట్రావెల్స్ సంస్థ యూరప్ టూర్ నిర్వహిస్తుందని తెలుసుకుని నిర్వాహకుడు శివప్రసాద్‌రెడ్డిని కలిశాడు. స్నేహితుడు కె.వెంకటనారాయణతో కలిసి వెళ్లేందుకు నిర్ణయించుకుని రూ.1.20 లక్షలు చెల్లించారు. అయితే శివప్రసాద్‌రెడ్డి కరోనా పేరు చెప్పి టూర్ వాయిదా వేసుకుంటూ వచ్చాడు. 2021లో యూరప్ బదులు దుబాయ్ టూర్‌కు వెళ్లాలని చెప్పాడు. దీనికి వారు ఒప్పుకున్నారు. అయితే అక్కడికీ తీసుకెళ్లకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. దీంతో కొద్ది రోజుల క్రితం ఐడియా మంత్ర కార్యాలయానికి వచ్చి చూడగా అది అక్కడ లేదు. మోసపోయినట్టు గ్రహించిన విష్ణువర్ధన్ బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా వెళ్తున్న వాహనం.. డ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇనుప కడ్డీలతో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహన డ్రైవర్‌పై కేసు నమోదైంది. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్ భవన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఓ డీసీఎం ప్రమాదకరంగా ఇనుప కడ్డీలను వేసుకొని వెళ్తుంది. డ్రైవర్‌ను హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో వాహనాన్ని ఆపి డ్రైవర్ ముజాఫర్‌ను బంజారాహిల్స్ శాంతిభద్రతల విభాగం పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు స్థలానికి విముక్తి

● జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లో కబ్జాకు గురైన పార్కు
● 350 గజాలను స్వాధీనం చేసుకున్న అధికారులు
● మరో వెయ్యి గజాల్లోనూ త్వరలో ప్రహరీ నిర్మాణం
● మేయర్ ఆదేశాలతో అధికారుల చర్యలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య ఉన్న పార్కు స్థలాన్ని కాలనీ వాసులు ఆక్రమించుకున్నారు. ఒకరు కూరగాయలు పండించగా మరొకరు కాంప్లెక్స్ జనరేటర్ పెట్టారు. ఇంకొకరు తమ ఇంటి ఎదురుగా స్థలం ఉంటడంతో సుందరీకరణ కోసం గడ్డి నాటేశారు. ఇలా ఎనిమిది సంవత్సరాలుగా ఆక్రమణదారుల చెరలో ఉన్న పార్కు స్థలం విషయం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి వెళ్లడంతో ఆమె స్వయంగా పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇప్పుడు జీహెచ్ఎంసీ అధికారులు పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు మొదలుపెట్టారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లో పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న సుమారు 1350 గజాల స్థలంలో పార్కు ఉంది. దీని చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే స్థలం ఎగుడుదిగుడు ఉండటంతో మొక్కలు నాటకుండా ఖాళీగా వదిలేశారు. పార్కులో పచ్చదనం పెంచే పరిస్థితి కనిపించలేదు. అలాగే స్థలం గురించి పట్టించుకునే వారు లేరని నిర్ధారించుకున్న ఓ ప్లాట్ ఓనర్ కొంతమేర పార్కును ఆక్రమించి అక్కడున్న ప్రహరీని కొద్దిగా తొలగించాడు. ఎవరి నుంచి అభ్యంతరం రాకపోవడంతో మొత్తంగా ప్రహరీని తొలగించి తన ప్లాట్‌లో నుంచి పార్కులోకి దారి ఏర్పాటు చేశాడు. అనంతరం అనవాళ్లు లేకుండా చేసి ఎత్తైన ప్రహరీ నిర్మించాడు. స్థలంలో కూరగాయల మొక్కలను నాటాడు. ఈ ఆక్రమణతో పార్కు లోపలికి వెళ్లేందుకు ఉన్న ఏకైక దారి మూసుకుపోయింది. దీంతో మిగతా ప్లాట్ యజమానులు సైతం పార్కును ఆక్రమించడం మొదలు పెట్టారు. ఓ నిర్మాణదారుడు ఏకంగా అపార్ట్‌మెంట్‌కు చెందిన జనరేటర్‌నే అందులో ఏర్పాటు చేశాడు. ఇంకొకరు ఉయ్యాల వేసి లాన్ వేసుకొని వాడుకుంటున్నాడు. ఇలా మొత్తం 1350 గజాల స్థలం ఆక్రమణకు గురైంది.

ఇలా వెలుగులోకి..

ఇళ్ల మధ్య ఉన్న పార్కు స్థలం ఆక్రమణ గురించి కాలనీకి చెందిన ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టాడు. దీంతో జీహెచ్ఎంసీపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పందించారు. స్వయంగా ఆక్రమణలను పరిశీలించి ఆమె ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆదేశించారు. మరుసటి రోజే అధికారులు బుల్‌డోజర్‌తో ప్రహరీని కూల్చివేసి జీహెచ్ఎంసీ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ కూల్చివేతలు 330 గజాల్లో మాత్రమే జరిగింది. మిగతా పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడంతో వారు స్థలాన్ని ఖాళీ చేశారు. ప్రస్తుతం పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి మరో రెండు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. కాలనీలో ఇంకా ఎక్కడైనా పార్కులు కబ్జాకు గురయ్యాయా అనే కోణంలో విచారిస్తున్నారు.



పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ సూచిక బోర్డు

ప్రతి నెలా తనిఖీ చేస్తాం

1350 గజాల పార్కు స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం. ఇందులో 350 గజాల స్థలాన్ని ఇప్పటికే స్వాధీనం చేసుకుని సూచిక బోర్డును ఏర్పాటు చేశాం. మిగతా స్థలాన్ని సైతం ఖాళీ చేయించాం. ప్రహరీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పూర్తి స్థాయిలో మొక్కలు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. కాలనీలోని మిగతా ప్రాంతాల్లో ఉన్న పార్కులను ప్రతి నెలా తనిఖీ చేసి కబ్జాల బారిన పడకుండా చూస్తాం.

\- శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

కులగణన భవిష్యత్ తరాలకు దిక్సూచి

● మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కులగణన భవిష్యత్ తరాలకు దిక్సూచి అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గతంలో కులగణనలో పాల్గొని వారే రీ సర్వేలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కులగణనపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జాతీయ బీసీ దళ్ రూపొందించిన టీ షర్టులను బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసాల్లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వేను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని, అయితే వివిధ కారణాల వల్ల 3.1 శాతం మంది పాల్గొనలేకపోయారన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా ఈ నెల 28 వరకు రీ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 04021111111ను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



టీషర్టులను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తాం

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారా హిల్స్ రోడ్డు నంబర్ 12లోని భోళానగర్‌లో రూ.18 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా రోడ్ల పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఆస్తి పన్నుపై ఫిర్యాదులకు ప్రత్యేక వేదిక

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లపై దూకుడు పెంచుతున్న జీహెచ్ఎంసీ అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక వేదికలను ప్రారంభించింది. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పన్ను విషయమై ఎలాంటి సమస్యలున్నా సర్కిల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జంట సర్కిళ్లలో తొలి పరిష్కార వేదిక శనివారం ప్రారంభమైంది సర్కిల్ 17లో తొలిరోజు 5 ఫిర్యాదులు రాగా.. సర్కిల్ 18లో 6 ఫిర్యాదులు వచ్చాయి. ఇంటి కొలతల్లో తప్పులు వచ్చాయని, ఇంటి పైభాగం కాలిపోయి నాలుగేళ్లు అయినా పన్ను చెల్లించమంటున్నారని, ఏప్రిల్‌లో ఎర్లీబర్డ్ ఆఫర్‌లో చెల్లించినా మళ్లీ చెల్లించాలని చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు వచ్చాయని సర్కిళ్ల ఉప కమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, ప్రశాంతి తెలిపారు. ఫిర్యాదులను 3 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశాలున్నాయని అధికారులు తెలిపారు.



పరిష్కార వేదికలో సమస్యలు వింటున్న ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, అధికారులు

'కుబేర' సినిమా టైటిల్‌పై వివాదం

పంజాగుట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాము గతంలో రిజిస్టర్ చేసుకున్న సినిమా టైటిల్ 'కుబేర'కు ముందు ఒక పేరు జోడించి ఆ టైటిల్ తమదే అని ఓ పేరున్న దర్శకుడు చెప్పుకోవడం అన్యాయమని త్రిశక్తి సినీ నిర్మాణ సంస్థ అధినేత, నిర్మాత నరేందర్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సహ నిర్మాతలు మల్లేష్, రజనీకాంత్, న్యాయవాది రాజేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కుబేర సినిమా టైటిల్‌ను తాము ఎప్పుడో రిజిస్టర్ చేసుకున్నామని, దాదాపు తొంబై శాతం సినిమా షూటింగ్ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు అదే టైటిల్‌తో ప్రముఖ హీరోలతో సినిమా ప్రకటించారని, ఈ విషయంలో తాము ఫిల్మ్ చాంబర్‌ను సంప్రదిస్తే పట్టించుకోకుండా తమనే వేధిస్తున్నారని ఆరోపించారు. వారు టైటిల్‌ను మార్చుకోవాలని లేదా తమకు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మాత నరేందర్



శ్రీరామ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, నంబూరి విజయశ్రీ చౌదరి, సదానందం

'లవకుశ' ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

పంజాగుట్ట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లవకుశుల జన్మస్థలంగా పేరొందిన కర్ణాటక కోలార్ జిల్లాలో లవకుశ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను స్థాపించి పలు దైవిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ ట్రస్ట్ రామ జన్మభూమి ట్రస్ట్‌కు అనుసంధానంగా పనిచేస్తుందని ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ నంబూరి విజయశ్రీ చౌదరి, అనవేన సదానందంలను నియమించి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలోని ముల్‌బగల్ జిల్లా అవని గ్రామం నుంచి ఏప్రిల్ 4న శ్రీరామ శోభాయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏర్పాటైన నూతన కార్యవర్గం శ్రీరాముడు, లవకుశుల పేరుతో ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేమన

సామాజిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లను విభజించాలి

● సామాజిక న్యాయ సాధన వేదిక కన్వీనర్ వేమన

పంజాగుట్ట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దళితుల్లో రిజర్వేషన్ల విభజన సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా చేయాలని సామాజిక న్యాయ సాధన వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఎస్ఆర్ వేమన ప్రభుతాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వేదిక ప్రతినిధులు కోలాటి పెద్దిరాజు, డాక్టర్ పట్టా వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన రిజర్వేషన్ల ఎంపిక ప్రక్రియ కారణంగా అల్ప సంఖ్యాకులైన ఎస్సీ ఉపకులాల వారు కనీసం విద్య, ఉద్యోగాలకు దరఖాస్తు చేసే అర్హతను సైతం కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. వ్యక్తి లేదా వర్గం వెనుకబాటుతనం ఆధారంగానే రిజర్వేషన్లు అమలు చేసే ఎంపిక పద్ధతి ఉండాలన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణపై తాము నమూనా తయారుచేశామని, జేఎన్‌యూలో ప్రస్తుతం అమలవుతోందని.. ప్రభుత్వం సైతం ఈ నమూనాను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు బడుగు భాస్కర్, జోగేష్, భూపతిరావు, కాగిత రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్

దేవనార్ అంధుల పాఠశాలలో వార్షికోత్సవం

బేగంపేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేవనార్ అంధుల పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దేవనార్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్టాండింగ్ కమిటీ సభ్యులుగా బోరబండ, రహ్మత్‌నగర్ కార్పొరేటర్లు

బోరబండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి రెండవసారి ఎన్నికయ్యారు. దీంతో శనివారం బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వారిని సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆకట్టుకుంటున్న 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో'

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నో చికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన మరో మూడు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.



వస్త్రాలను పరిశీలిస్తున్న సందర్శకులు



భరత్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సనత్‌నగర్ బీజేపీ నాయకులు

సనత్‌నగర్‌లో బీజేపీ పటిష్టంగా ఉంది

● పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే పనిచేయాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ సూచించారు. ఇటీవల జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భరత్‌గౌడ్‌ను సనత్‌నగర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు ఆకుల మహేశ్, వై.శ్రీనివాస్‌రావు, సుమన్‌కుమార్, సుధాకర్ ముదిరాజ్, కుషాల్ కుమార్, శివప్రసాద్, అశ్విని శ్రావణ్, నాగార్జున కలిసి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వివిధ రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో మెక్ డోనాల్డ్, రాఘవేంద్ర ఉడిపి, ఖైరతాబాద్ క్షత్రియ టిఫిన్స్, మాదాపూర్‌లో బేక్‌బాక్స్, టాన్ కాఫీలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న వ్యాపారులకు నోటీసులు అందజేశారు.

నిరుపయోగంగా బ్రిడ్జి!

- ముగిసిన ఐదేళ్ల టెండర్
- పనిచేయని ఎస్కలేటర్, లిఫ్ట్
- మెట్ల ద్వారా ఎక్కలేక పాదాచారులు, విద్యార్థుల అవస్థలు



నిరుపయోగంగా ఎస్కలేటర్, లిఫ్ట్



మారేడుపల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ప్రయాణికులు, విద్యార్థులు, పాదాచారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని జీహెచ్ఎంసీ అధికారులు ఎంతో ఆర్భాటంగా మారేడుపల్లి సంగీత్ సమీపంలోని సేయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జి పైకి మెట్ల ద్వారా మాత్రమే ఎక్కాలి. ఎస్కలేటర్, లిఫ్ట్ పని చేయడం లేదు. దీంతో ఫుట్‌పాత్ ప్రయాణికులు, విద్యార్థులు మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నారు. మెయింటనెన్స్ లేకపోవడంతో క్రమంగా నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. బ్రిడ్జి నిర్వహణ బాధ్యత చూడడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, వృద్ధులు, పాదాచారులు, ఎస్కలేటర్, లిఫ్ట్ ద్వారా రోడ్డు దాటేందుకు ఉపయోగంగా ఉంటుందని అత్యాధుని పరికరాలతో ఈ బ్రిడ్జి నిర్మించారు. అనతికాలంలోనే నిరుపయోగంగా మారడంతో ప్రాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎస్కలేటర్, లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి వినియోగంలో తేవాలని స్థానికులు కోరుతున్నారు.


సేయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ ఇనుప బ్రిడ్జ్

త్వరలో బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొస్తాం

ఇటీవలే పదవీ బాధ్యతలు చేపట్టాను. ఈ విషయంపై అవగాహన ఉంది. ఐదు నెలలుగా ఇది ప్రజలకు ఉపయోగకరంగా లేదని తెలిసింది. బేగంపేట్ పబ్లిక్ స్కూల్ వద్దఉన్న బ్రిడ్జిని మారేడుపల్లి సేయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఉన్న బ్రిడ్జిని రెండింటికీ టెండర్లు పిలిచి త్వరలో మెయింటనెన్స్ యథావిధిగా జరిపి పాదాచారులు, విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం. ఐదేళ్లలో ఒకరికి కాంట్రాక్ట్ ఇవ్వడంతో ఆ కాంట్రాక్ట్ కాలం ముగిసింది. నూతనంగా టెండర్ ప్రక్రియ ద్వారా కొత్తవారికి అనుమతి ఇచ్చి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- చంద్రశేఖర్, ఏఈఈ, జీహెచ్ఎంసీ

మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేసి, మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బొర్ర భిక్షపతి డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మాదిగలకు మంత్రి పదవులు లేకపోవడం మాదిగ జాతిని అవమానపరచడమేనని ఆయన విమర్శించారు. సికింద్రాబాద్‌లోని డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్ హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24న డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ విభాగాల రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. లక్షల డప్పులు, వేయి గొంతులు కార్యక్రమంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. టి.వి.నర్సింగ్‌రావు, డప్పు మల్లికార్జున్, అజిత్‌కల్యాణ్, వేల్పుల విష్ణు, గజ్జల రాజశేఖర్, మునిరాతి రామకృష్ణ, రెడ్డిపాక రవి పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి


జలమండలి ఏఈతో కలిసి అడ్డగుట్టలో పర్యటించిన ఆదం భరత్ కుమార్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అడ్డగుట్టలో అభివృద్ధి కుంటి పడిందని, ఎక్కడ చూసినా మంచినీటి సమస్య ఫిర్యాదులు వస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆదం భరత్ కుమార్ అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని శనివారం మారేడుపల్లి జలమండలి ఏఈ స్రవంతితో కలిసి భరత్ కుమార్ సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లోని బోయబస్తీ, బుద్ధానగర్, అడ్డగుట్ట ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులు మంచినీటి సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంటరాజు సాగర్, డివిజన్ అధ్యక్షుడు గణేష్ యాదవ్, అనిల్, రాంప్రసాద్, దొమ్మేటి శివకుమార్, హరి, జగదీష్, సేవాదల్ నాయకురాళ్లు రామలీల, వరలక్ష్మి పాల్గొన్నారు.

కులగణన సర్వేను తప్పు పట్టడం సరికాదు


మాట్లాడుతున్న కోట నీలిమ

అమీర్‌పేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేయాల్సి వస్తుందన్న భయంతో తమ ప్రభుత్వంపై బీజేపీ తప్పుడు ప్రచా రం చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలి మ ధ్వజమెత్తారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కులగణన సర్వే చరిత్రాత్మకమైనదని, సమర్థవంతం గా, పారదర్శకంగా జరిగిందన్నారు. ఈ సర్వేతో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి కులగణను నిర్వహించారన్నారు. కులగణన సర్వేపై ప్రతి పక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని వారి మాటలు నమ్మొద్దన్నారు.

వెస్లీ కళాశాల వద్ద వంతెనకు కృషి

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వెస్లీ కళాశాల వద్ద పాదాచారుల వంతెన ఏర్పాటుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శనివారం సర్దార్ పటేల్ రోడ్డులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకులు తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు చింతపట్ల బద్రినాథాచార్యులు నీలిమను స్వాగతం పలికి శాలువతో సత్కరించారు.

అభివృద్ధికి కృషి


సీవరేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

అమీర్‌పేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి అన్నారు. భగత్ సింగ్ పార్క్ ప్రాంతంలో రూ. 5.5 లక్షలతో చేపట్టనున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను ఆమె శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జలమండలి డీజీఎం వంశీ, మేనేజర్ హిందూజా, నాయకులు ఖలీల్ బేగ్, పురుషోత్తం, ఫాజిల్, విష్ణు, నరేందర్ రెడ్డి, సాయి. రవి తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ కైవసమే బీజేపీ లక్ష్యం


భరత్‌గౌడ్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ బలమైన పార్టీ అని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గాన్ని కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ పేర్కొన్నారు. ఇటీవల కొత్తగా జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భరత్ గౌడ్‌ను బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ నాయకులు ఆకుల మహేశ్, వై. శ్రీనివాస్ రావు, సుమన్‌కుమార్, సుధాకర్ ముదిరాజ్, కుషాల్ కుమార్, శివ ప్రసాద్, అశ్విని శ్రావణ్, నాగార్జున కలిసి అభినందలు తెలిపారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

చంద్రబాబును విమర్శించడం సరికాదు


మాట్లాడుతున్న నర్సింగరావు

తిరుమలగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీశ్వర్ రెడ్డి విమర్శించడం తగదని మల్కాజ్‌గిరి పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యుడు జనగామ నర్సింగరావు అన్నాడు. శనివారం ఆయన బొల్లారంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ప్రస్తుతం టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న చంద్రబాబు నాయుడుపై అవాక్కులు చవాక్కులు పేల్చడం సరికాదన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

- డిప్యూటీ ఈఓ శ్రీధర్



నృత్యం చేస్తున్న చిన్నారులు

పద్మారావునగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సికిందరాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కువగా పేద మధ్యతరగతికి చెందిన ప్రజలు నివసించే బన్సీలాల్‌పేట్ మేకలమండిలో అన్ని సౌకర్యాలతో ఉన్న ప్రభుత్వ పాటశాలలో తమ పిల్లలను చేర్పించి, చదివించాలన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ, ఇతర తరగతుల విద్యార్థులు నృత్యాలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మల్లికార్జునరెడ్డి, రాంపల్లి రాజు, శేషగిరిరావు, నర్సింగరావు, పూర్వ ఉప విద్యాశాఖ అధికారి చిరంజీవి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం స్వప్నలత, సున్నంభట్టి స్కూల్ హెచ్ఎం పుష్పలత, నల్లగుట్ట స్కూల్ హెచ్ఎం శౌరి, ప్రభాకర్, పాఠశాల భవనాల శాఖ డిప్యూటీ ఈఈ సంజీవ్, ఏఈ వెంకట్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి


ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కాంగ్రెస్ సేవాదళ్ సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత అన్నారు. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల, తుకారాంగేట్ ప్రభుత్వ పాఠశాలలో సంఘం ప్రతినిధులు విజిట్ చేశారు. ఈసందర్భంగా సంగీత మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు లేవని, స్కూల్‌లో పనిచేసేందుకు ఆయాలు కూడా లేరన్నారు. ఆజాద్‌చంద్రశేకర్‌నగర్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలకు రక్షణ లేదని, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. ఈ బడుల్లో మంచినీటి సమస్య, టీచర్ల కొరత ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విజిట్ చేసిన వారిలో సంఘం ప్రతినిధులు రామలీల, రాష్ట్ర కార్యదర్శి ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ వెంకటరాజం, మేరీ, నాగలక్ష్మి, రవి ఉన్నారు.

ఆరోగ్య భద్రత తప్పనిసరి


కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. శనివారం సికింద్రాబాద్‌లోని టాటా ఏఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ బ్రాంచ్ విన్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పయాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరికీ కుటుంబ భద్రతకు ఇన్సూరెన్స్ అవసరమని ఆయన సూచించారు. కార్యక్రమంలో విన్ విజన్ కంటి ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సురేంద్రనాథ్, సీఈఓ మేనేజర్ నాగరాజు, ప్రసాద్, యాదగిరి, సహయ మేనేజర్లు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు సీలు


ఐడీహెచ్ కాలనీలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సీలు వేస్తున్న రెవెన్యూ అధికారులు

పద్మారావునగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగూడలోని ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు శనివారం ముషీరాబాద్ మండల రెవెన్యూ అధికారులు సీలు వేశారు. ఈ విషయమై ముషీరాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్ రంజని వివరాలు వెల్లడిస్తూ తహసీల్దార్ ఆదేశాల మేరకే బోయగూడ ఐడీహెచ్ కాలనీలోని ఖాళీగా ఉన్న(అలాట్‌మెంటు కాని) 18 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు అధికారికంగా సీలు వేశామని తెలిపారు. దీనికి సంబంధించిన రిపోర్టును తహసీల్దార్‌కు అందజేస్తామని తెలిపారు. ఆర్ఐ ఆదిల్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బేగంపేట్ ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): దేవనర్ స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరైయ్యారు. అంధ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ చేసే వివిధ కార్యక్రమాలను వివరించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. అంధ విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదువుకొని సమాజానికి ప్రయోజనకరంగా మారాలని, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. దేవనార్ చేస్తున్న సేవలు కొనియాడారు. దేవనర్ ఫౌండేషన్ ఎదుగుదలలో భాగస్వాములైన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సాయిబాబాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా వరల్డ్ థింకింగ్ డే



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తన చిన్ననాటి జ్ఞపకాలను గుర్తు చేశాయని రాంగోపాల్‌పేట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుల జయంతి సందర్భంగా శనివారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ జిల్లా కార్యాలయంలో థింకింగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బెడెన్ పొవెల్, లేడి బెడెన్ పొవెల్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో చిన్ననాటి నుంచి క్రమశిక్షణను అలవరచడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరావు, ఏఎస్సై సాంబ నాయక్, డాక్టర్ గీతా, దక్షిణ మధ్య రైల్వే పీఆర్ఓ రాజేష్, జిల్లా చీఫ్ కమిషనర్ కేవీ దేవ్‌దత్, జిల్లా కార్యదర్శి రమేష్ చందర్, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మనోజ్‌కుమార్, ట్రైనింగ్ కమిషనర్ విజయభాస్కర్, ఆర్గనైజింగ్ కమిషనర్లు గౌరీనాథ్, సంగీతా పాండే, కమిషనర్లు డాక్టర్ ఎంహెచ్ భతేనా, రాజేశ్వరి, విష్ణు ప్రసాద్, పలువురు స్కౌట్ మాస్టర్లు, గైడ్ క్యాప్టెన్లు, స్కౌట్స్ గైడ్స్ రోవర్స్, రేంజర్స్ పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో మేధోశక్తి


తెలంగాణ సచివాలయం నమూనా


వైజ్ఞానిక ప్రదర్శనలో అయోధ్య రామాలయం

బౌద్ధనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో మేధోశక్తిని పెంపొందిస్తాయని ముషీరాబాద్ మండల డిప్యూటీ ఐఓఎస్ స్వరూపరాణి అన్నారు. శనివారం మేడిబావిలో అమరావతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్కూల్ భవనంలో నిర్వహించిన జ్ఞానోదయ-2025 వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్స్ ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, కవితారెడ్డి, ప్రసన్నలక్ష్మి, వీణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంపొందించాలి


జేఎన్‌టీయూ వీసీ కిషన్ కుమార్ రెడికి వినతిపత్రం అందజేస్తున్న జాజుల లింగం గౌడ్ తదితరులు

తార్నాక, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యాప్రమాణాలను పెంపొందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. విద్యా ప్రమాణాలు పాటించని ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని జేఎన్‌టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు దనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయని, ఇంజనీరింగ్ కళాశాలలు ఎటువంటి విద్యా ప్రమాణాలను పాటించడం లేదని జాజుల లింగం గౌడ్ మండిపడ్డారు.

లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రాలు అందజేత


లబ్ధిదారులకు ఎల్ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిలకలగూడకు చెందిన బాలమణి, మంజుల చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 3లక్షల50వేలు మంజూరయ్యారు. ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాలను శనివారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకు రామచందర్, శేఖర్, అశ్విన్, బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన నీలేష్ సింగ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వే యార్డులో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే యార్డులో శనివారం ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీరా అక్కడికి వెళ్లి చూడగా శరీర భాగాలు రెండు ముక్కలై ఉంది. మృతుడి వివరాలు ఆరా తీయగా నీలేష్ సింగ్ అని స్నేహితుల ద్వారా తెలిసిందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు తన స్నేహితులతో కలిసి కడపకు వెళ్లేందుకు రైల్వే వెయిటింగ్ హాల్‌లో ఉండగా నీలేష్ సింగ్ ఇప్పుడే వస్తానని బయటికి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు రైల్వే స్టేషన్‌లో గాలిస్తుండగా ఆ సమయంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడన్న సమచారం తెలిసింది. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతుడు తన స్నేహితుడేనని పోలీసులకు చెప్పారు. మృతుడికి మూడు నెలల క్రితమే పెళ్లి అయిందని పెళ్లైన నెలరోజులకే దంపగుల మధ్య విభేదాలు ఉన్నాయని, అప్పటి నుంచి నీలేష్ సింగ్ మనో వేధనకు గురవుతున్నాడని పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో నవ వధువు మృతి


శిరీష (ఫైల్)

బౌద్ధనగర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పెళ్లి అయిన ఐదు నెలలకే ఓ నవవధువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో భర్త చనిపోయిన అల్వాల్‌కు చెందిన చితాని శిరీష(28)కు, మొదటి భార్యతో విడాకులు తీసుకున్న వారాసిగూడకు చెందిన ఎన్.యాకుబ్ రెడ్డి(35)కి 2024 అక్టోబరు 16న పెద్దల సమక్షంలో రెండో వివాహం జరిగింది.భార్యాభర్తలిద్దరూ అత్తమామతో కలిసి వారాసిగూడలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన యాకుబ్‌రెడ్డి నిత్యం భార్యను వేధించేవాడు. శిరీష అత్త పనికి వెళ్లగా భర్త యాకుబ్‌రెడ్డి, మామ రామిరెడ్డి ఇంట్లోనే ఉన్నారు. యాకుబ్‌రెడ్డి మద్యం తాగటానికి తండ్రిని రూ.200 అడిగాడు. దీంతో భార్య డబ్బులు ఇవ్వవద్దని మామకు చెప్పింది. అతను బయటకు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 1:30 సమయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భర్తను గదిలో గడియపెట్టిన శిరీష మరోగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బయట నుంచి వచ్చిన మామ రామిరెడ్డి ఫ్యాన్‌కు వేలాడుతున్న శిరీషను చూసి గడియపెట్టి గదిలో ఉన్న కుమారుడిని బయటకు తీసుకొచ్చి శిరీషను కిందకు దింపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శిరీష మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు యాకుబ్‌రెడ్డి, రామిరెడ్డిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనంతో హోంగార్డును ఢీకొట్టిన మహిళ

తిరుమలగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను నిలువరించిన మహిళా కానిస్టేబుల్‌తో పాటు పక్కనే ఉన్న హోంగార్డుపై సదరు మహిళ దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల మేరకు... సైనిక్‌పురికి చెందిన హానీహబ్సి సాఫ్ట్ వెర్ ఉద్యోగి. ఆమెకు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు చెవులు సరిగా వినిపించవు. శనివారం రాత్రి నేరేడ్‌మెట్‌లోని డాక్టర్ వద్దకు వైద్య పరీక్షలు చేయించుకొని ఏఓసీ సెంటర్‌కు బయలు దేరింది. తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయం చౌరస్తా వద్దకు వస్తుండగా, విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ లహరిక.. హెల్మెట్ లేకుండా బండి నడుపుతున్న హాని హబ్సిబాను అడ్డుకున్నారు. దీంతో ఆమె వాహనాన్ని స్పీడ్ పెంచడంతో అక్కడే ఉన్న హోంగార్డ్ రాజాబాబును ఢీకొట్టింది. గాయాల పాలైన రాజాబాబు ఫిర్యాదు చేయగా వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ యాత్ర పేరుతో మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విదేశీ యాత్ర పేరిట డబ్బు వసూలు చేసి మోసం చేసిన ట్రావెల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. కాప్రాకు చెందిన ఎ.విష్ణువర్ధన్ ప్రభుత్వ ఐఐసీటీలో ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. 2019లో స్నేహితుడి ద్వారా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఉన్న ఐడియా మంత్ర ట్రావెల్స్ సంస్థ యూరప్ టూర్ నిర్వహిస్తుందని తెలుసుకుని నిర్వాహకుడు శివప్రసాద్‌రెడ్డిని కలిశాడు. స్నేహితుడు కె.వెంకటనారాయణతో కలిసి వెళ్లేందుకు నిర్ణయించుకుని రూ.1.20 లక్షలు చెల్లించారు. అయితే శివప్రసాద్‌రెడ్డి కరోనా పేరు చెప్పి టూర్ వాయిదా వేసుకుంటూ వచ్చాడు. 2021లో యూరప్ బదులు దుబాయ్ టూర్‌కు వెళ్లాలని చెప్పాడు. దీనికి వారు ఒప్పుకున్నారు. అయితే అక్కడికీ తీసుకెళ్లకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. దీంతో కొద్ది రోజుల క్రితం ఐడియా మంత్ర కార్యాలయానికి వచ్చి చూడగా అది అక్కడ లేదు. మోసపోయినట్టు గ్రహించిన విష్ణువర్ధన్ బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా వెళ్తున్న వాహనం.. డ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇనుప కడ్డీలతో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహన డ్రైవర్‌పై కేసు నమోదైంది. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్ భవన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఓ డీసీఎం ప్రమాదకరంగా ఇనుప కడ్డీలను వేసుకొని వెళ్తుంది. డ్రైవర్‌ను హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో వాహనాన్ని ఆపి డ్రైవర్ ముజాఫర్‌ను బంజారాహిల్స్ శాంతిభద్రతల విభాగం పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.